# సనాతన ధర్మం

**– డా॥ రేవూరు అనంతపద్మనాభరావు**

మనం భారతీయులం. మనకు ఉపయోగపడే వృక్షసంపద, ఖనిజసంపద, సూర్యరశ్మి, సారవంతమైన భూములు ఉన్నాయి. సమశీతోష్ణస్థితి, అందమైన ప్రకృతి, అద్భుతనాగరికత మనకు వరప్రసాదాలు. ప్రకృతి వల్ల లాభాలు తెలుసుకొని మన పెద్దలు దానిని ఆరాధించారు. అనాదికాలం నుండి మునులు, ఋషులు సత్యాన్ని వెదుకుతూ తపస్సు చేశారు. ఫలితంగా వేదాలు పుట్టాయి. అవే శ్రుతులు. మన ఋషులు గొప్ప జీవన విధానాన్ని మానవధర్మంగా చెప్పారు. అదే మన సనాతన ధర్మం. మనది హిందూదేశం గనుక అది హిందూధర్మం.



**హిందూధర్మం అంటే ఏమిటి?**

ఇతరులకు అపకారం చేయకుండడం, ఇతరుల సొమ్మును ఆశించకపోవడం, దయ, క్షమ, దానం వంటి లక్షణాలు కలిగివుండడం దీని లక్షణాలు. ప్రజలు ధర్మాన్ని రక్షణకవచంగా దరిస్తే, ధర్మం ప్రజలందరినీ రక్షిస్తుంది. ధర్మాన్ని నాశనం చేస్తే అది మనల్ని నాశనం చేసి తీరుతుంది. సీతమ్మను అపహరించి ధర్మాన్ని నశింపజేశాడు రావణుడు. రాముడు చేసిన ధర్మయుద్ధంలో రావణుడు తన కుటుంబాన్ని అంతటినీ కోల్పోయాడు. పాండవులు ఆటంకాలు ఎదురైనా ధర్మమార్గంలో నడిచి కురుక్షేత్రయుద్ధంలో విజయం సాధించారు. అందరూ ధర్మాన్ని పాటిస్తే చట్టాల అవసరం లేదు. లోకంలో ధర్మమే మిత్రుడు. ధర్మాన్ని ఆచరించువాడు పశువుతో సమానం.



**ధర్మ లక్షణాలేవి?**

ధర్మానికి 10 లక్షణాలు చెబుతారు. అవి 1.ధైర్యం. ఏ కార్యం చేయాలన్నా ధైర్యం ముఖ్యం. ధైర్యం లేని వాడు జీవితంలో ఏదీ సాధించలేడు. సమాజంలో చెడును ఎదిరించి, మంచిని పెంచడానికి ధైర్యం అవసరం. 2.క్షమ ఓర్పు, అదే సహనం. ఈ గుణం మానవుని మహానుభావుని చేస్తుంది. 3. దమం – మనసును అదుపులో వుంచుకోవడం. మనోనిగ్రహం సాధిస్తే మనుషులు ఋషులవుతారు. 4.అస్తేయం – పరుల వస్తువులు కోరకపోవడం. 5. శౌచం – మానసికంగా, భౌతికంగా శుచిగా వుండడం భగవంతుని ఉపాసనకు ముఖ్యం. 6.ఇంద్రియనిగ్రహం. చంచలమైన ఇంద్రియాలపై నిగ్రహం కలిగిన వ్యక్తి కీర్తి పొందుతాడు. 7. స్థిరమైన బుద్ధి, 8. విద్య – వస్తువుల జ్ఞానాన్ని ఉన్నది ఉన్నట్లుగా గ్రహించడంవల్ల మంచి మార్గంలో



జీవించగలుగుతారు. 9. సత్యాన్ని ఆశ్రయిస్తే మానవులు మహనీయులవుతారు. 10. కోపం లేకుండా ఉండడం. కోపంలేని వారే సత్పురుషులు.

**సత్యం :**

ధర్మసాధనకు అహింస ప్రధానం. అహింసను పరమధర్మంగా మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ధర్మం క్రియారూపం. సత్యం మాటలరూపం. సత్యాన్ని మించిన ధర్మం లేదు. నూరుగురు సత్పుత్రులకంటె ఒక సత్యం గొప్పది. హరిశ్చంద్రుడు సత్యాన్ని వ్రతంగా పాటించాడు. 'సత్యమేవ జయతే' అనేది భారత ప్రభుత్వ లక్ష్యం. "ఎక్కడ ధర్మమో అక్కడ విజయము" –అనేది సుప్రీం కోర్టు ధ్యేయం.

**నాలుగు పురుషార్థాలు :** మన హిందూ సనాతనధర్మంలో నాలుగు విషయాలు ప్రధానంగా చెప్పారు :

1.ధర్మము 2.అర్థము 3. కామము 4. మోక్షము. ఏ వస్తువైనా కావాలనుకోవడం, ఏదైనా సుఖాన్ని అనుభవించాలను కోవడం కామం. దాని ద్వారా ప్రయత్నిస్తే అర్థం (ధనము, వస్తువు) దొరుకుతుంది. కామాన్ని, అర్థాన్ని ధర్మంగా అనుసరిస్తే మోక్షానికి దారిచూపుతుంది. ఉత్తములు దానిని సాధిస్తారు. న్యాయంగా డబ్బు సంపాదించుకోవచ్చు. కోర్కెలు తీర్చుకోవచ్చు, కానీ, వాటిని ధర్మబద్ధంగా సాధించాలి.

**ధర్మం:** ధర్మాన్ని పాటించిన పురాణ పురుషులెందరో. హరిశ్చంద్రుడు, భీష్ముడు, బలిచక్రవర్తి, శిబిచక్రవర్తి సత్యవాక్ పరిపాలన ద్వారా, త్యాగంద్వారా ధర్మాన్ని పాటించారు. శ్రీరామచంద్రుడు మూర్తీభవించిన ధర్మం. స్వాతంత్రం సాధించడానికి ఝాన్సీ లక్ష్మీబాయ్, భగత్‌సింగ్, లాలాలజపతిరాయ్, తాంతియాతోపే, వీరపాండ్య



కట్టబొమ్మన్, అల్లూరిసీతారామరాజు ప్రాణాలనే అర్పించారు. అహింసాపద్ధతిలో గాంధీజీ ముందుకు నడిచారు. మహాభారతంలో విదురుడు ధృతరాష్ట్రునికి ధర్మం యొక్క గొప్పదనాన్ని నొక్కి చెప్పాడు. అదే విదురనీతి.

**అర్థం:** అర్థం అంటే ఏదో కాదు. మనం అనుభవించే పదార్థాలు, సుఖభోగాలు అన్నీ అర్థం కిందికే వస్తాయి. కేవలం డబ్బుకాదు ముఖ్యం. సంపాదించిన డబ్బును త్యాగం చేసే స్వభావం వుండాలి.

**కామం:** కోరికలు ధర్మంతో కూడి వుండాలి. అలివిమాలిన కోరికలు దుఃఖానికి దారితీస్తాయి. రాజ్యం తనకే కావాలనుకొన్న దుర్యోధనుడు నాశనమయ్యాడు గదా! కోరికలు అదుపులో వుంచుకొంటే మనసుకు నిశ్చింతగా ఉంటాం. ఆధునికమానవుడు అర్థకామాలను పట్టుకొని ధర్మాన్ని మోక్షాన్ని వదిలేశాడు.



**మోక్షం:** బంధాలు విడివడటమే మోక్షం అన్నారు రమణ మహర్షి. 'నేను' అనేది పరిమితి భావన. ప్రపంచమంతా నేననే భావన రావాలి. రమణుల సందేశాన్ని అనుసరించి సాధనచేసి మోక్షాన్ని అందుకోగలగాలి. 'వలెనన్న బంధము, వలదన్న మోక్షము' – అన్నాడు అన్నమయ్య.

**నాలుగు రకాల ఆశ్రమాలు:** నూరేళ్ల మానవజీవితాన్ని నాలుగు రకాలుగా విభజించారు. 1. బ్రహ్మచర్యాశ్రమం 2. గృహస్థాశ్రమం 3. వానప్రస్థాశ్రమం. 4.సన్యాసాశ్రమం. ఒక్కొక్క ఆశ్రమానికీ కొన్ని నియమాలు, కర్తవ్యాలు ఉన్నాయి.

**1. బ్రహ్మచర్యాశ్రమం:** ముషికి బాల్యంలోనే మంచి వ్యక్తిత్వానికి సంబంధించిన పునాదులను తల్లిదండ్రులు, గురువులు అందిస్తారు. బ్రహ్మం అంటే తపస్సు. జ్ఞానం పరమాత్మ. చదువుకోవడం, భౌతికసుఖాలకు దూరంగా వుండడం ఈ సమయంలో అవసరం. శ్రీరాముడు వసిష్ఠుని



వద్ద, శ్రీకృష్ణుడు సాందీపని వద్ద ఆశ్రమాలలో విద్య నభ్యసించారు.

**2. గృహస్థాశ్రమం:**విద్యాభ్యాసం కాగానే వివాహం చేసుకొని గృహస్థజీవితం ఆరంభించాలి. ధర్మబద్ధంగా సంపాదించాలి. నిరాడంబరంగా జీవించాలి. మంచి సంతానాన్ని కని, పెంచాలి. సంపాదనలో కొంత దానం చేయాలి. గృహస్థాశ్రమమే అన్ని ఆశ్రమాలలో శ్రేష్ఠమైనది. గృహస్థు లేక పోతే మానవసృష్టి అసలే లేదు. భార్యాభర్త లిద్దరూ ధర్మాన్ని అనుసరించి సంతానాన్ని కనాలి. పెంచి సమాజ ఋణం, భగవంతున్ని ఋణము, తల్లిదండ్రులఋణం, ఋషుల ఋణము తీర్చుకోవాలి.

**3. వానప్రస్థాశ్రమం:** 60 సంవత్సరాల వయసుదాటిన తర్వాత, ఆ వ్యక్తి కుటుంబబాధ్యతలు పిల్లల కప్పజెప్పి సమాజసేవకు పూనుకోవాలి. తాను ఏదీ ఆశించకూడదు.

తాను సంపాదించిన ధనము, అనుభవము ఇతరులకు పంచాలి.

**4. సన్న్యాసాశ్రమం:** ఈ దశలో అన్నీ వదలి వైరాగ్యంతో జీవించాలి. దేహం మీద మమకారం వదలుకోవాలి. ప్రపంచసంబంధ విషయాలను ఒక్కొక్కటి వదలు కొని, సుఖదుఃఖాల కతీతంగా మెలగి పరబ్రహ్మలో లీనమయ్యే ప్రయత్నం చెయ్యాలి. మహాభారతంలో చివరి దశలో ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు అడవుల కెళ్లిపోయారు.

**16 సంస్కారాలు (షోడశ సంస్కారాలు):**

మానవ జీవితం ఒక యజ్ఞం వంటిది. మానవజీవితంలో కొన్ని సామాజిక బాధ్యతలున్నాయి. శరీరాన్ని, మనస్సును శుద్ధి చేసుకొనేందుకు 16 సంస్కారాలు చేస్తారు. అవి –



1. గర్భాదానం 2. పుంసవనం 3. సీమంతం 4. జాతకర్మ 5. నామకరణం 6. నిష్క్రమణం (సూర్యదర్శనం) 7. ఉపవేశనం (చంద్రదర్శనం) 8. అన్నప్రాశనం 9. చూడాకరణం 10. కర్ణవేధ 11. అక్షరాభ్యాసం 12. ఉపనయనం 13. ఉపాకర్మ 14. స్నాతకం 15. వివాహం 16. అంత్యేష్టి.

మనిషి పుట్టింది మొదలు చనిపోయే వరకు ఈ 16 సంస్కారాలు జరపాలి. వీటిలో వివాహం ప్రధానము, అతిముఖ్యం. గృహస్థాశ్రమం ఒక పవిత్రయజ్ఞం. ఆ వ్యవస్థలో వారు ధర్మార్థకామమోక్షాల సాధనకు ప్రయత్నించాలి. ప్రతిదశలోను మహర్షులు సంస్కారాలను కలిగిస్తూ మోక్షాన్ని మానవుడు పొందేందుకు కృషి చేశారు.

**మహనీయుల మంచి మాటలు :** సనాతన హిందూధర్మం వేల సంవత్సరాల నాటిది. ఇది ఎవరో ఒక గురువు ఆరంభించలేదు. యుగయుగాలుగా మహర్షులు నిరంతరం



అధ్యయనం చేసి ఈ ధర్మాన్ని రూపొందించారు. మానవసంక్షేమంకోసం వారు మంచి మాటలు ఏరుకొన్నారు. ధర్మాన్ని, త్యాగాన్ని, కర్తవ్యాన్ని, బాధ్యతలను గుర్తుచేస్తూ సూక్తులు చెప్పారు. అవి మణులు, మాణిక్యాలు.

గురుశిష్యుల మార్గాన్ని గూర్చి చెబుతూ శాంతి మంత్రాన్ని పఠించారు. మేము పొందిన జ్ఞానాన్ని ప్రపంచం నలుమూలలా వ్యాపించేలా చూచి, మాలో మాకు ద్వేష భావాలు లేకుండా చూడము. 'ఓం సహనావవతు' అనే మంత్రం చదువుతారు. లోకకల్యాణం కోసం పనిచేయడం గురుశిష్యుల బాధ్యత. ఇది మన భారతీయ సంప్రదాయంలో గొప్పదనం.

**పరమాత్మ అంతటా ఉన్నాడు :**

యజుర్వేదంలో ఈశావాస్యోపనిషత్తులో 'ఓం ఈశావాస్య మిదం సర్వం' అనే శ్లోకం వుంది.



భగవంతుడెక్కడ ఉంటాడు? అనేది చాలా మందికి సందేహం. జ్ఞానమార్గాన్ని, కర్మ మార్గాన్ని రెండింటినీ ఇందులో కలిపి చక్కటి వివరణ ఇచ్చారు. భగవంతుడు ఈ సృష్టిలో అణువణువునా వ్యాపించి వున్నాడు. మానవుడు చేసే పనులు భగవంతుడు గమనిస్తూనే వుంటాడు. అలా అనుకొంటే పాపాలు, అపరాధాలు చేయరు. పరమాత్మ ప్రపంచమంతా నిండి వుండడం వల్ల ఇది ఎవరిదీ కాదు. అందుకే స్వార్థబుద్ధిని వదలిపెట్టాలి. వివాహసంబంధమైన కోర్కెలు వదలుకోవాలి. పరమార్థంపై దృష్టిపెట్టాలి. "మనది కాని వస్తువును సంపాదించాలనే కోరిక పనికి రాదు". ఇదీ మహర్షులు చెప్పిన సూక్తి.

**పరిస్థితుల ననుసరించి జీవించాలి :**

భర్తృహరి లోకోపకారకమైన ఎన్నో సుభాషితాలు చెప్పాడు. ఏదైనా పని చేయాలనుకొన్నవారు పరిస్థితుల

ననుసరించి సర్దుకొనేగుణం, సహించే శక్తి కలిగి వుండాలి. సుఖాలకు బానిస కాకూడదు. పని సాధించాలనుకొన్న వాడు సుఖదుఃఖాలు లెక్కించకూడదు. అలాంటి జీవనశైలి చిన్నతనం నుండి అలవాటుచేసుకోవాలి.

**ప్రయత్నంవల్ల ఫలితం :**

అనుకున్నపని సాధించడానికి తనకున్న శక్తియుక్తుల్ని రెండింతలు, మూడింతలు చేసి తీవ్రంగా ప్రయత్నించాలి. ఉదాహరణకు సింహాన్ని తీసుకుందాం. అది అడవికి రాజు. అతిపరాక్రమం కలది. అలా అని గుహలోనే కూచొని వుంటే దానికి ఆహారం లభించదు గదా! ఎంతో ప్రయత్నం చెయ్యాలి. ఒక వ్యక్తి డాక్టరో, ఇంజనీరో కావాలంటే, పోటీపరీక్షలు నెగ్గాలి. ఐదారు సంవత్సరాలు కష్టపడి చదవాలి. కలలు నిజం కావాలంటే అది తప్పదు. అందుకు నీవు జాగృతుడవు కావాలి.



**సత్యం పలుకుదాం :**

సనాతనధర్మం ఇలా చెప్పింది. సత్యమే పలకాలి. అది కూడా ప్రియంగా ఉండాలి. సత్యమే అయినా అప్రియంగా, కఠినంగా పలకరాదు. ప్రియాన్ని కలిగిస్తుందని అసత్యం చెప్పరాదు. నిజాలు వినడానికి కఠినంగా ఉంటాయి. వాటిని ఎవరూ వినడానికి ఇష్టపడరు. మనం సత్యాన్ని చెప్పే తీరులో అప్రియత్వం పనికి రాదు.

**పుణ్యమే రక్ష :**

"మనం అరణ్యంలో, యుద్ధభూమిలో, నీటిలో అగ్నిలో, సముద్రంలో, కొండ కోనల్లో ఎక్కడ ఉన్నా మనం చేసిన పూర్వపుణ్యాలు మనల్ని కాపాడుతాయి" అంటాడు భర్తృహరి. మనం ఈ జీవితంలోనే కాదు, పూర్వజన్మలలో చేసిన పుణ్యాలు కూడా ఆపదనుండి మనల్ని కాపాడుతాయి. ఇతరులకు ఉపకారం చేయడమే పుణ్యం. మన భవిష్యత్తును క్షేమంగా ఉంచుకోవడాకి అందుకే పుణ్యకార్యాలు చేయాలి.



**ఈ జీవితం ఉపకారం చేయడానికే :**

ఈ శరీరం పరోపకారం కోసమే. వృక్షాలు, నదులు, గోవులు ఎలాంటి లాభాన్ని ఎదురుచూడకుండా పరులకోసం జీవిస్తున్నాయి. మానవుడు కూడా అలానే పరోపకారిగా జీవించాలి.

**వృక్షో రక్షతి రక్షితః**-వృక్షం ఒక గురువు. వృక్షాన్ని దేవతగా గౌరవించడం భారతీయ సంప్రదాయం. వితరణ – ఇతరులకివ్వడం – అనే విషయంలో వృక్షం గురువు.

**ఎలా మాట్లాడాలి?:**

తొలి పరిచయంలోనే హనుమంతుడు శ్రీరాముని మనసు దోచుకున్నాడు. ఎదుటివారిని తొలిసారి కలిసినపుడు ఎలా పరిచయం చేసుకోవాలో వాల్మీకి మహర్షి హనుమ ద్వారా చెప్పాడు. వినడాకి ఇంపుగా, సొంపుగా, తొందరపాటు లేకుండా, మనోహరంగా మాట్లాడాలి.



**స్నేహం ఎలాంటి వారితో చేయాలి?**

వియ్యానికైనా, కయ్యానికైనా సమానస్థాయి ఉండాలని పెద్దల వాక్కు. అలా కాకపోతే అది అవమానాలపాలవుతుంది. మహాభారతం లోని ద్రోణునితో ద్రుపదుడిలా అంటాడు. "నావంటి రాజుకు దరిద్రుడైన మిత్రుడుండటం సరికాదు. క్రూరునితో ప్రశాంతునికీ, సజ్జనునితో దుర్జనునికీ సఖ్యం కుదరదు. ధనము, కులము, బలము సమానంగా ఉంటేనే స్నేహం కుదురుతుంది".

**దైవమే రక్ష :**

రాయబారానికి వచ్చిన శ్రీకృష్ణుడు కౌరవసభలో దైవరక్ష గురించి వివరించాడు. అధర్మాన్ని అణచివేసే శక్తి ధర్మానికుంది. ధర్మం తన ప్రభావాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడినపుడు పెద్దలు పరిస్థితిని చక్కదిద్దాలి. వారు చూచీ చూడనట్లు వుంటే అది వారికే నష్టం. ధర్మాన్నీ, సత్యాన్నీ

దైవం రక్షిస్తుంది. అంతటా నిండి వున్న పరమాత్మ సర్వజీవులలో ఉన్నాడనే భావంతో ప్రార్థన చెయ్యాలి.

**ధర్మవీరులు :**

ధర్మంకోసం పోరాడిన వారు ధర్మవీరులు. అలాంటి వారిలో శ్రీరామచంద్రుడు, దధీచి, భీష్ముడు, సావిత్రి–లను ఉదాహరణగా చెప్పవచ్చు. శ్రీరాముడు ధర్మార్థ కామాల తత్వం తెలిసినవాడు. మూర్తీభవించిన ధర్మస్వరూపం. రాజ్యపాలన కంటె ధర్మపాలన ముఖ్యమని చెప్పి రాజ్యాన్ని తృణప్రాయంగా భావించి భరతుని కప్పగించాడు. ఎన్నో ధర్మపరీక్షలు ఎదుర్కొని మర్యాదాపురుషోత్తముడయ్యాడు.

త్యాగం విషయంలో దధీచి ప్రథమస్థానంలో వుంటాడు. తన వెన్నెముకను దానం చేసి ఇంద్రుని వజ్రాయుధం తయారు చేసుకొనేందుకు తోడ్పడ్డ



మహనీయుడు. ధర్మరక్షణకోసం తనను తాను త్యాగం చేసుకొన్నాడు.

సావిత్రీ సత్యవంతుల గాధ పురాణ ప్రసిద్ధం. అల్పాయుష్కుడని తెలిసీ సత్యవంతుని సావిత్రి పెండ్లాడింది. ప్రాణాలు వదలిన సత్యవంతుని బ్రతికించుకోవడానికి ఆమె యముని మెప్పించగలిగింది. ధర్మబద్ధంగా జీవించడానికి వీరందరు మనకు ఆదర్శప్రాయులు.

**సంస్కృతీ వికాసం:**

భారతీయ సంస్కృతికి అనేక ముఖాలున్నాయి. వైదికధర్మం, భారతీయధర్మం, ఆర్యధర్మం, ఆర్షధర్మం, సనాతనధర్మం, మానవధర్మం, హిందూధర్మం అని రకరకాల పేర్లున్నాయి. ధర్మం అంటే ఏమిటి? అనే సందేహం వస్తుంది. మానవుడికి ఏది ఆధారమవుతుందో అది ధర్మం. అనాది నుంచి ఏ ధర్మం ఆచరణలోకి వస్తుందో



అదే సనాతన ధర్మం. అది శాశ్వతం. ఈ సనాతన ధర్మం అన్నిదేశాలవారిచేత ప్రశంసించబడింది.

“ధర్మానికి జయం కలుగుగాక! అధర్మం నశించుగాక! ప్రపంచానికి శుభం కలుగు గాక!” అని పెద్దల సూక్తి. ఆహారము, నిద్ర, భయము వంటివి జంతువులకు, మనుష్యులకు సమానం. ధర్మమార్గంలో నడిస్తే ఈ లోకంలో కీర్తి, పరలోకంలో మంచి గతి లభిస్తాయని గ్రంథాలు చెబుతున్నాయి. ఈ లోకంలో సంపాదించిన కీర్తి పరలోకంలో సుఖానికి తోడ్పడుతుంది.

చెడ్డవాళ్లను దండించడానికి మంచివాళ్లను రక్షించడానికీ భగవంతుడు యుగయుగాలలో అవతరిస్తాడని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పాడు. ధర్మాన్ని నిత్యం ఆచరించే వారికి భగవంతుని కృప లభిస్తుంది. ధర్మంవల్ల మోక్షం లభిస్తుంది. ఇతరుల మనసు బాధపెట్టే పని మనం



చేయకపోవడమే ఉత్తమ ధర్మం.“ఒరులేయవి ఒనరించిన” అనే భారతపద్యం ఆద్యుప్రాయం.

**ధర్మానికి వివిధ లక్షణాలు :**

ధరించడం, స్థిరత్వం, ధైర్యం అనే భావనతో ఓర్పు కలిగి కష్టాలు సహించాలి. దొంగతనం చేయకూడదు. నీతి లేకుండా సంపాదించడం, అక్రమార్జన – దొంగతనం కిందికి వస్తాయి. శారీరక, మానసిక వాచికశుద్ధి కలిగి ఉండాలి. ఉత్తమభావాలు, ఆలోచనలు, దైవభక్తి వంటివి అంతఃశుద్ధికి సంబంధించినవి. ఇంద్రియనిగ్రహం, బుద్ధి, విద్య, జ్ఞానము, సత్యము, కోపం లేకుండా వుండటం – అనేవి పది లక్షణాలు. మహర్షులైన మనువు, పరాశరుడు, వ్యాసుడు అనేక ధర్మశాస్త్రగ్రంథాలు వ్రాసి మార్గదర్శకు లయ్యారు. ధర్మం అంటే దైవమే. అన్ని ప్రాణులకు క్షేమాన్ని కలిగించేది ధర్మం. శ్రీరాముడు, ధర్మజుని వంటివారు

ధర్మాత్ములు. రామాయణ, భారత, భాగవతాలు ఈ ధర్మాన్నే బోధిస్తున్నాయి. శ్రీరాముడు ధర్మస్వరూపం. ధర్మారాజు సంప్రదాయానికి కట్టుబడిన వ్యక్తి.

**ప్రాచీన ధర్మం :**

సనాతనధర్మం అతి ప్రాచీనం. సమాజానికి సమత్వం చూపే ధర్మం. అది కాలక్రమేణా పెరిగిన గొప్ప వ్యవస్థ. సామాజిక విలువలకు, ప్రవర్తనకు సంబంధించిన ధర్మం. సత్యం, జ్ఞానం, దయ, హింస మొదలైనవి ఎన్నడూ మారని అంశాలు. ఆకాశం నుండి పడిన వర్షం భూమి మీద అనేక మార్గాలలో ప్రవహించి చివరికి సముద్రంలో కలుస్తుంది. అందుకే అన్నారు – 'నదీనాం సాగరో గతిః' అని. సనాతన ధర్మమే అన్నిటికీ మూలాధారం. అన్ని రకాలైన ఆలోచనాస్రవంతులు ఇందులో నుండి వచ్చాయి.

మానవమనుగడ సమాజంతోనే ముడిపడి ఉంటుంది. సమాజానికి ఆమోదయోగ్యమైన ప్రవర్తనా



నియమావళి అవసరం. ఆ నియమాలే సమాజంలో మనుష్యుల ప్రవర్తనను నియంత్రిస్తాయి. మంచిని కోరడం, వ్యసనాలు లేకుండటం, పరోపకారం చేయడం, స్త్రీలను గౌరవించడం, ప్రియంగా మాట్లాడటం ఇవన్నీ ధర్మంలో భాగమే. ధర్మం ఎల్లవేళలా మానవహితాన్ని, పరులహితాన్ని సమాజహితాన్ని, సర్వమానవాళి హితాన్ని కోరుకుంటుంది. (సర్వేజనాః సుఖినో భవంతు, లోకాః సమస్తాః సుఖినో భవంతు)ధర్మము, త్యాగము, సదాచారాల వలననే ఈ జాతి ఇంకా జీవించివుంది. ఈ సందర్భంలో రామకృష్ణ పరమహంస సందేశం చిరస్మరణీయం. "ఆచారం ధాన్యంపై పొట్టు లాంటిది. మనం తినడానికి దాన్ని తీసేసి, బియ్యం తింటాం. కాని, విత్తనంగా నాటాలంటే ఆ పొట్టుకూడా అవసరం. బియ్యం నాటితే మొలక రాదు గదా! పొట్టుతో ఉంటేనే ధాన్యం పనికి వస్తుంది".



## ధర్మరక్షణ :

**1. ఆదర్శ గోవు :**

ఈ కథ బాగా ప్రసిద్ధం. గోవును తినడానికి పులి వచ్చింది. నా బిడ్డకు పాలిచ్చి వస్తానంది గోవు. సందేహించినా, అలానే పోయి రమ్మంది పులి. గోవు తన బిడ్డకు పాలిచ్చి బుద్ధులు చెప్పి పులి వద్దకు తిరిగి వచ్చింది. పులికి కళ్లలో నీళ్లుతిరిగాయి. గోవు ధర్మప్రవర్తనకు పులి నమస్కారంపెట్టి వెళ్ళిపోయింది. ధర్మాన్ని గోవు రక్షించింది. గోవును ధర్మం రక్షించింది. మాట తప్పకుండా పులికి ఆహారంగా ఆవు వచ్చి నిలిచింది. ఈ వృత్తాంతంలో గమనించవలసిన అంశం సత్యధర్మనిష్ఠ.

**2. ఆదర్శ పక్షి :**

రామాయణంలో జటాయువు కథ బాగా ప్రసిద్ధం. ఒంటరిగా వున్న సీతను రావణు



డపహరించాడు. ఆ సమయంలో జటాయువు సీతను రక్షించడానికి రావణునితో తన శక్తినంతా వొడ్డి పోరాడింది. అయినా సీతమ్మను విడిపించలేకపోయింది. రెక్కలు తెగి పడిపోయి మరణించింది. సీత జాడ వెదుకుతూ వచ్చిన రామలక్ష్మణులు జటాయువు చేసిన సహాయాన్ని గుర్తించి తమ తండ్రికి చేసినట్లే దహనసంస్కారాలు నిర్వహించారు. ధర్మరక్షణలో అది గొప్ప సంఘటన. ఈ విషయంలో గుర్తించదగిన అంశం ఆపదలో ఉన్న స్త్రీని కాపాడటానికి శక్తియుక్తులు ప్రదర్శించిన పక్షి ఆదర్శం.

**3. ఆదర్శ వీరుడు :**

గంగాశంతనుల కుమారుడు భీష్ముడు. తన తండ్రి శంతనునికీ, సత్యవతికీ వివాహం జరపడానికి వీలుగా తాను వివాహం చేసుకోబోనని భీషణ ప్రతిజ్ఞ (భయంకర

ప్రతిజ్ఞ) చేశాడు. సోదరుల కుమారులైన ధృతరాష్ట్ర పాండురాజులను పెంచి, పోషించి రాజులను చేశాడు. భీష్ముడు లేకుంటే మహాభారతకథే లేదు. జీవితాన్ని ఒక వ్రతంగా భావించి, తన సమస్తాన్నీ కౌరవసామ్రాజ్య వికాసానికి అర్పించిన సమరయోధుడు భీష్ముడు. ఆయన ఆ సామ్రాజ్యానికి వారసుడు. అయినా తృణప్రాయంగా వదలివేశాడు. కురుక్షేత్రయుద్ధం అనివార్యమైంది. ఆయన దుర్యోధనుని పక్షాన నిలిచాడు. తొలిసేనాధిపతి అయ్యాడు. పదిరోజులు సంకులసమరం జరిగింది. పాండవులకు ఏమీ పాలుపోలేదు. "తాతా! నిన్ను జయించాలంటే ఉపాయం చెప్పు"మని భీష్ముని ప్రాధేయపడ్డారు. 'శిఖండి ఎదుట నిలిస్తే నేను బాణాలు ప్రయోగించను" అని వారికి సూచించాడు భీష్ముడు. శిఖండిని ముందుపెట్టుకొని అర్జునుడు యుద్ధం చేశాడు. భీష్ముడు అస్త్రసన్యాసం చేశాడు. అర్జునుని



బాణప్రయోగానికి భీష్ముడు నేలవాలాడు. స్వచ్ఛందమరణం వరంగా ఉన్న అతడు ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూచాడు. యుద్ధం పూర్తి అయింది. ధర్మరాజుకు రాజ్యపాలన తంత్రం తెలియజెప్పాడు. శ్రీకృష్ణుని సన్నిధిలో చివరకు ప్రాణాలు వదిలాడు. భీష్ముడు అంపశయ్యపై పరుండి తన యిష్టం వచ్చిన సమయాన శరీరం వదలి పెట్టాడు. ధర్మరక్షకుడై భీష్ముడు లోకానికి ఆదర్శవీరుడయ్యాడు.

**పంచ యజ్ఞాలు :**

గృహస్థులైనవారు తమ దినచర్యలో భాగంగా చేసే పనుల్లో జీవులకు కొంత అపకారం జరుగుతుంది. తినే తిండికోసం ఆపనులు చేసినా అపకారం జరుగుతోంది కాబట్టి అవి పాపాలన్నారు పెద్దలు.



ఆపాపాలను పోగొట్టుకోవడానికి ఐదు యజ్ఞాలు రోజూ చేయాలని నియమం పెట్టారు. ఇది నాకోసం కాదు – "ఇదం న మమ" – అని యజ్ఞంలో మంత్రం చెబుతాము. ఇతరులకు మేలు చేయడమే యజ్ఞం. ఇది సనాతన సంప్రదాయం. ఆ యజ్ఞాల వివరాలివి :

**బ్రహ్మయజ్ఞం :**

వేదమంత్రాలను (ఋక్, యజుర్, సామవేదాలు) స్వరయుక్తంగా గానం చేయడమే వేదాధ్యయనం. ఇది బ్రహ్మయజ్ఞం. బ్రహ్మం అంటే వేదం. మంచి గ్రంధాలు చదవడం, పారాయణం చేయడం వంటివి మొదటి దశ. రెండోదశలో చదివిన విషయాన్ని బాగా ఆలోచించి అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు స్వాధ్యయనాన్ని ఒక యజ్ఞంగా పేర్కొన్నాడు.



**దేవయజ్ఞం :**

రకరకాల దేవతల తృప్తికోసం చేసే యజ్ఞాలలో హవిస్సును స్వాహాపూర్వకంగా సమర్పించేది దేవయజ్ఞం. ఇందువల్ల దేవఋణం తీరిపోయి మోక్షం లభిస్తుంది.

**పితృయజ్ఞం :**

పితృదేవతల తృప్తికోసం చేసే కర్మలు, తర్పణాలు – అందులో చేసే అన్నసంతర్పణలు, పితృతర్పణాలు పితృయజ్ఞ మనబడతాయి. పితృదేవతలను తృప్తి పరిస్తే మన కోర్కెలు తీర్చుతారు. దాని ద్వారా వంశాభివృద్ధి కలుగుతుంది. వంశం కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి.

**భూతయజ్ఞం :**

జీవరాసుల తృప్తికోసం భూతబలిగా ఇచ్చే ఆహారము, జంతువులకు, పక్షులకు, క్రిమికీటకాలకు ఇచ్చే

ఆహారము భూతయజ్ఞం. ఆభూతయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి.

**మనుష్యయజ్ఞం :**

తనకున్నంతలో అతిధులకు, అభ్యాగతులకు భోజనం పెట్టడం, సామూహిక అన్నదానాలు చేయడం, అభ్యాగతులకు సహాయం చేయడం మనుష్య యజ్ఞం. ఇందులో భార్య సహకారం ఎంతో అవసరం. దీనినే అతిధి యజ్ఞం అని కూడా అంటారు. ఈవిధమైనయజ్ఞ యాగాదులు హిందూ సనాతనసంప్రదాయంలో ప్రధానభాగాలు. శ్రద్ధాసక్తులతో వీటిని నిర్వహించడం మానవుల కర్తవ్యం.

**మూడుఋణాలు :**

మానవుడు మూడు ఋణాలతో జీవిస్తాడు. అవి – దేవఋణం, ఋషి ఋణం, పితృ ఋణం. ఈ మూడు



ఋణాలను తీర్చడం మన కర్తవ్యంగా భావించాలి.

**దేవఋణం :** సమస్త జీవులకు తండ్రి అయిన ఆ పరమేశ్వరుని ఋణం తీర్చుకోవడం మన కర్తవ్యం. దేవతలను పూజించడం ముఖ్యం.

**ఋషిఋణం :** మన వంశాలకు మూలపురుషులు ఋషులు. వాళ్లు రచించిన శాస్త్రాలు, ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు క్షుణ్ణంగా తెలిసికొని వాటిని ఆచరించాలి. మనం ఇతరుల చేతకూడ అవి ఆచరింపజేయాలి. అప్పుడే ఋషి ఋణం తీరుతుంది.

**పితృఋణం :** ఇది రెండు రకాలు 1. జీవించి ఉన్న మాతాపితరుల ఋణం. 2. మరణించిన పెద్దల ఋణం. జీవించి వున్న తల్లిదండ్రులకు నిత్యం సేవచేయాలి. తాను సంతానాన్ని కని, వంశాభివృద్ధికి తోడ్పడాలి. మరణించిన పెద్దలకు ఆయా సంప్రదాయాల ప్రకారం తర్పణాలు,



దానాదికాలు చేసి పితృదేవతలకు ఆనందం కలిగించాలి. అలా చేయడం వారికి ఊర్ధ్వలోకక్రియలు చేయడమవుతుంది.

**ధర్మ స్వరూపం :**

అనాదికాలంలో వేదరాశి ఒకటిగా వుండేది. దానిని వ్యాసమహర్షి నాలుగుగా విభజించారు. 1.ఋగ్వేదము, 2. యజుర్వేదము 3. సామ వేదము 4.అధర్వణవేదము. ఆ నాలుగు వేదాలను ఆయన శిష్యులు – పైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు – నేర్చుకొని లోకంలో ప్రచారం చేశారు.

అన్ని వేదాలలో ప్రాచీనం – ఋగ్వేదం. పరమాత్మను, ప్రకృతి శక్తులను స్తుతించే మంత్రాలిందులో ఉన్నాయి. దేవతల పూజావిధానాన్ని తెలియజేసేది యజుర్వేదం. గానం చేయడానికి వీలుగా ఉండేది



సామవేదం. అగ్ని, వరుణ, ఇంద్రాది దేవతల స్తోత్రాలు ఇందులో ప్రధానం. ఇందులో ఛాంద్యోగ్యోపనిషత్తు, కఠోపనిషత్తు ప్రముఖం. అధర్వవేదంలో మంత్ర, తంత్ర ప్రయోగ విధాలున్నాయి. మానవకల్యాణం, సుఖ సంపదలు, శత్రునాశనము – అనే విషయాలు ఈ వేదంలో చెప్పబడ్డాయి.

**వేదభాగాలు :**

వేదాలలో సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్తులు శ్రుతి ప్రధానభాగాలు. నిజం చెప్పాలి. ధర్మాన్ని ఆచరించాలి. శ్రద్ధతో చదవాలి. అతిధుల్ని దైవంగా భావించాలి. వేదాల తర్వాత తెలుసుకోదగినవి ధర్మసూత్రాలు, స్మృతిగ్రంధాలు సూత్రరూపంలో ఛందోబద్ధంగా ఉంటాయి. అవి సాధారణధర్మాల్ని,

విశేషధర్మాల్ని, వర్ణాశ్రమధర్మాల్ని, ఆచారవ్యవహారాల్ని ప్రాయశ్చిత్తాది విషయాలను తెలుపుతాయి.

నాలుగు వేదాలకు నాలుగు ఉపవేదాలున్నాయి. ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, అర్థవేదం – అవి. ఆగమాలు, శాస్త్రాలు, భగవద్గీత, పురాణాలు, ఇతిహాసాలు, దర్శనాలు – ఆర్షగ్రంథాల సారాంశాన్ని ప్రమాణపూర్వకంగా చూపుతాయి. అవి సనాతన ధర్మవికాసానికి ఉపయోగపడతాయి. బుద్ధుడు, ఆది శంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు – ఇంకెందరో తత్త్వవేత్తలు దార్శనికులుగా, ధర్మాచార్యులుగా నిలబడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఉపయోగపడే అనేక విషయాలు చెప్పారు.



**త్రిమత సంప్రదాయాలు :**

**1. అద్వైతం :**

ఈ సంప్రదాయంలో బ్రహ్మమాత్రమే సత్యం. ఈ జగత్తు అనేది మిథ్య – అసత్యం. జీవుడే పరమాత్మ. జీవుడు, పరమాత్మ ఒక్కడే. ఈ అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది ఆదిశంకరుడు.

**2. విశిష్టాద్వైతం :**

జీవుడు, పరమాత్మ, జగత్తు – మూడూ సత్యాలే. శ్రీమన్నారాయణుడు నిత్యం నివసించేది వైకుంఠం (పరమ పదం)లో. పరమ పదాన్ని పొంది భగవంతుని దర్శిస్తూ, కీర్తిస్తూ, సేవిస్తూ ఆనందాన్ని అనుభవించడమే ముక్తి. ఈ విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తిచేసింది రామానుజుడు.

**ద్వైతం :**

పరమాత్మ, జీవాత్మ వేర్వేరు తత్వాలు. దేవుడికీ, జీవుడికీ మధ్య సంబంధం యజమానికీ, సేవకునికీ



మధ్యవున్న సంబంధం వంటిది. భక్తితో నిత్యం భగవంతుని సేవించి, విష్ణులోకం పొందడమే ముక్తి. ఈద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది మధ్వాచార్యులు. ఈ మూడు సిద్ధాంతాలలో ఏ సంప్రదాయాన్ని శ్రద్ధాభక్తులతో ఆచరించినా భక్తి మార్గంలో నడచి ముక్తిని చేరుకోవచ్చు.

**గురుశిష్యపరంపర :**

హిందూధర్మంలో ప్రాచీనసంప్రదాయాలు గురువునుండి శిష్యునికి, తండ్రినుంచి తనయునికి సంక్రమిస్తాయి. హిందూత్వం సార్వజనీన ధర్మం. భగవత్ తత్వం సత్యం, స్వచ్ఛం. వ్యక్తి ప్రవర్తన, ఆలోచన, మాట, క్రియ స్వచ్ఛంగా ఉన్నపుడే ఏదైనా సాధ్యం. ఆధ్యాత్మిక జీవన విధానానికి ఇవే పునాదులు.

గురువు లేకుండా సంసార (భవ) సాగరాన్ని దాటడం కష్టం. ఆయన త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులతో సమానం. ఆయన బోధనలవల్లనే సమస్త



కార్యాలూ ఫలిస్తాయి. మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానదీపాన్ని వెలిగించే వాళ్లే గురువులు. జన్మనిచ్చేది తల్లిదండ్రులు. ఆజన్మను సార్థకం చేసే జ్ఞానాన్ని ప్రసాదించేది గురువు.

**గురువులలో రకరకాలు :**

1. చదువు చెప్పే గురువు సూచక గురువు
2. ఆశ్రమ ధర్మాలు చెప్పే గురువు బోధక గురువు
3. వశీకరణ, మారణప్రయోగాలు నేర్పే గురువు, నిషిద్ధగురువు
4. విషయ భోగాలపై విరక్తి కలిగించి, జ్ఞానమార్గాన్ని బోధించే గురువు విహితగురువు
5. జీవన బ్రహ్మైక్యం గురించి బోధించేది పరమగురువు.

దత్తాత్రేయ స్వామికి చాలా మంది గురువులు. భగవంతుడే గురుని రూపంలో వస్తాడంటారు. గురువు

నిచ్చెన లాంటి వాడు. ఆ నిచ్చెనపై ఎక్కి శిష్యులు ఉన్నత స్థానాలకు వెళతారు. అందువలన గురువుకు ఎవరూ సాటిరారు.

వసిష్ఠుడు ఇక్ష్వాకు వంశంవారికి గురువు. ఆయన బోధనలు విని శ్రీరామచంద్రుడు ఆదర్శపురుషుడయ్యాడు. శ్రీరామునికి అస్త్రాది విద్యలు, బలాతిబలవిద్యలు నేర్పిన గురువు విశ్వామిత్రుడు. గురువు సాక్షాత్ భగవంతుడే. గురువు జ్ఞాని. "జ్ఞాని ఎవరోకాదు నేనే" నన్నాడు గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు. భారతీయ సంస్కృతిలో విశిష్ట గురువు వ్యాసుడు. పాండవులను సన్మార్గంలో నడిపించిన గురువాయన. వ్యాసుని జన్మదినమైన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా పాటిస్తాం.

**శ్రీకృష్ణుని గురువు :**

భాగవతంలో శ్రీకృష్ణ బలరాముల విద్యాభ్యాసం గూర్చిన కథ ప్రశస్తం. సాందీపని వద్ద వారిరువురు



విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం పూర్తికాగానే 'గురుదక్షిణగా మీకేం కావాలి?' అని వీరు గురువును అడిగారు. మరణించిన "నా కుమారుని తెచ్చివ్వమని' అడిగాడు గురువు. అతడు సముద్రస్నానానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. బలరామకృష్ణులు సముద్రంలోకి ప్రవేశించారు. పంచజనుడనే రాక్షసుని కడుపులో వెదికారు. పాంచజన్య శంఖంతో యముని నగరానికి వెళ్లి శంఖనాదం చేశారు. యముడు గురుపుత్రుని తెచ్చియిచ్చాడు. గురుదక్షిణ సమర్పించారు శిష్యులు.

ఈ ఆదర్శ గురుశిష్యసంప్రదాయాన్ని భారత దేశంలో ఎందరో మహనీయులు బోధించి మార్గదర్శకు లయ్యారు. దయానందసరస్వతి, వివేకానందులు అరవిందులు, రమణమహర్షి, రామకృష్ణ పరమహంస,



మలయాళస్వామి వంటి మహనీయులు శిష్యుల ద్వారా భారతీయ సనాతనసంప్రదాయాన్ని ప్రపంచం నలుమూలలా చాటి చెప్పారు.

హనుమంతుడు సూర్యునితో బాటు తిరుగుతూ వేదాలు నేర్చుకొన్నాడు. సంగీతంలో త్రిమూర్తులైన త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి – సంగీత గురువులు. గురువులు ప్రతిఫలాన్ని అపేక్షించరు. శిష్యుల అభివృద్ధిని మాత్రమే కోరుకొంటారు.

ఈవిధంగా దార్శనికులు, తత్వవేత్తల మూలంగా గురుశిష్యపరంపర ఎడ తెగకుండా సాగిపోతోంది. ఏ మహాత్ములు ఏకాలంలో బోధించినా దేశకాల పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొన్నారు. ఒకే పరమసత్యాన్ని వారివారి దర్శనాల ననుసరించి వివరించారు, బోధించారు, ఆచరించారు, ఆచరింపజేశారు. అందుకే అన్నారు 'ఏకం



సత్ విప్రా బహుధా వదంతి' (ఒకే సత్యం, దానిని పలువురు పండితులు పలురకాలుగా చెబుతారు.

ఇలా సనాతన సంప్రదాయం బహుముఖాలుగా విస్తరిల్లి లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ వుంది.

**గురుశిష్య సంవాదం :**

ఈ సృష్టి సమస్తం పరబ్రహ్మస్వరూపమే ననడంలో సందేహంలేదు. తైత్తిరీయోపనిషత్తులో ఒక తాత్వికచర్చ గురుశిష్యులమధ్య జరిగింది. అన్నం నుంచి ఆనందం వరకు ఆ చర్చ కొనసాగడం విశేషం. ఆ రోజుల్లో అధ్యయనం 12 సంవత్సరాలు కొనసాగేది. అలా చదువుపూర్తి చేసిన శిష్యుడు గురువును ఒక ప్రశ్నవేశాడు.

శిష్యుడు : "ఈ సృష్టిలో ఏది ఉత్తమం?"

గురువు : నీవే అధ్యయనం చేసి చెప్పాలి.

అనేక గ్రంథాలు చదివిచ్చాడు.

శిష్యుడు : అన్నం బ్రహ్మ.

గురువు : అన్నం ఎవరికి అవసరం? ప్రాణమున్నవారికే. శిష్యుడు మరికొన్ని సంవత్సరాలులు అధ్యయనం చేసివచ్చి–

శిష్యుడు : ప్రాణమే బ్రహ్మం.

గురువు : ప్రాణంలో వుండి అన్నం తిన్న ఈ శరీరాన్ని నడిపించేది ఏది?

– శిష్యుడు మరింత అధ్యయనం చేసి వచ్చి –

శిష్యుడు : మనస్సే బ్రహ్మం. ప్రాణమ్ ప్రధానమైనా, ఆ ప్రాణముండే శరీరాన్ని కదల్చేది మనస్సు గురువుగారూ!

గురువు : మనస్సు చపలమైనంది. బుద్ధి మాత్రం స్థిరం.

శిష్యుడు : విజ్ఞానమ్ బ్రహ్మం.



గురువు : విజ్ఞానం అధార్మికులవల్ల మారణహోమానికి కారణమవుతుంది గదా!

ఇంకా లోతుగా అధ్యయనం చేసిన శిష్యుడు ఇలా అన్నాడు.

శిష్యుడు : ఆనందమే బ్రహ్మ.

గురువు : ఆనందో బ్రహ్మ– అని పెద్దలన్నారు. ఎంతో సంతోషం.

ఈ చర్చ వలన గ్రహించాల్సిన అంశాలివి :

అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము – ఇవన్నీ సక్రమంగా ఉపయోగించుకొన్నపుడే అంతా సవ్యంగా కొనసాగుతుంది. అది లేనినాడు ప్రపంచ యుద్ధాలు రావు. ఆనందముంటే పోరాటాలే లేవు.

* * *